

**'ఇండోర్' పనులు ముమ్మరం**

పాలమూరులో ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వివరాలు 8లో ▸



**చెంచుల జీవనంపై అధ్యయనం**

ఎన్ఐఆర్డీ శిక్షకుల బృందం చెంచుల జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.2 /26.3

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

# 16 రకాల పండ్ల మొక్కలు

### తోటల పెంపకానికి రైతులకు ఉచితం

- మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు భరించనున్న ప్రభుత్వం
- సన్నకారు, చిన్నకారు రైతులకు అవకాశం
- అవగాహన కల్పిస్తే పెరగనున్న పండ్లతోటల సాగు విస్తీర్ణం



గుండుమాల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ (ఫైల్)

**కోస్గి:** పంట పొలాల్లో పండ్ల మొక్కలు పెంచడంతో రైతులకు ఆదాయాన్ని కల్పించాలనే లక్ష్యంతో, ప్రభుత్వం సన్నకారు, చిన్నకారు రైతులకు ఉచితంగా వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. హరితహారంలో భాగంగా పెద్దమొత్తంలో మొక్కలు పెంచిన ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా పండ్ల మొక్కలను పెంచాలనే లక్ష్యంతో నూతన పథకానికి సిద్ధమైంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతోపాటు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆసక్తి ఉన్న రైతులకు పండ్ల మొక్కలు ఉచితంగా అందించనున్నారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల మొక్కలు నాటిన రైతులకు మొక్కలు నాటిన ఏడాది కాకుండా మూడేళ్ల వరకు మొక్కల నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే భరించనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉపాధి హామీ, ఉద్యానవన శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఆసక్తి ఉన్న అర్హులైన రైతులు భూమి పట్టాపాస్ బుక్, ఆధార్, ఉపాధి జాబ్‌కార్డులతో తమ గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్‌అసిస్టెంట్ల దగ్గర గాని, గ్రామ పంచాయతీ కార్యదర్శుల దగ్గర గాని లేదంటే నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

### మొక్కలు నాటేందుకు అనుమతి..

ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం మామిడి, బత్తాయి, జామ వంటి పండ్ల మొక్కలు నాటేందుకు మాత్రమే అవకాశం ఇచ్చేది. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీతో పాటు ఉద్యానవన శాఖల పరిధిలో మామిడి, బత్తాయి, జామతోపాటు నారింజ, సపోట, జీడి మామిడి, సీతాఫలం, దానిమ్మ, ఆపిల్‌బేర్, కొబ్బరి, మునగ, చింత, అల్లనేరేడు, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్ వంటి 16 రకాల పండ్ల మొక్కలను నాటుకోవడానికి, సాగు చేయడానికి అనుమతి ఇస్తున్నారు.

### గరిష్టంగా 5 ఎకరాలకు మంజూరు..

పండ్ల మొక్కలు నాటుకోవడానికి ప్రభుత్వం గరిష్టంగా ఒక్కో రైతుకు 5ఎకరాల వరకు అనుమతి ఇస్తుంది. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న పెద్దకారు రైతులు ఈ పథకానికి అనర్హులు. ఈ పథకానికి ఎంపికైన రైతులు ఏదైనా పండ్ల మొక్కలను ఎంపిక చేసుకొని నాటుకోవచ్చు. సాగు చేయాలనుకున్న విస్తీర్ణంలో రెండు, మూడు రకాల మొక్కలను సైతం కలిపి నాటుకోవచ్చు. రైతులు వారికి నచ్చిన నర్సరీల నుంచి పండ్ల మొక్కలను తీసుకోవచ్చు. ఒక్కో మొక్కకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ఆధారంగా సదరు రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. ప్రభుత్వ నిర్ణీత ధరకంటే మొక్క ధర ఎక్కువగా ఉంటే రైతులే ఎక్కువైన ధరను భరించాల్సి ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలో ఎన్ని మొక్కలు అవసరమవుతాయో అధికారులే అంచనా వేస్తారు. అధికారులు సూచించిన ప్రకారమే మొక్కలు నాటుకోవాల్సి ఉంటుంది.

### తోట నిర్వహణకు నిధులు

పండ్ల మొక్కల నిర్వాహణకు ఉపాధి హామీ నిధులు వెచ్చించనున్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులను ఉపాధి కూలీలతో చేయిస్తారు. మరుసటి ఏడాది నుంచి మూడు సంవత్సరాల పాటు మొక్కల పెంపకానికి అవసరమయ్యే నిర్వహణ నిధులు చెల్లించనున్నారు. నాలుగేళ్లపాటు రైతులు నాటిన మొక్కలను సంరక్షించుకుంటే ఐదో ఏడాది నుంచి ఫలాలు చేతికొస్తాయి. ఆయా సీజన్లకు అనుకూలంగా మొక్కల రకాలను ఎంచుకోవాలి. డిమాండ్ ఉన్న సమయంలో పండ్లు చేతికి వచ్చేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించి ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పండ్ల మొక్కల పెంపకం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా చిన్నకారు, సన్నకారు రైతులు పంటభూముల్లో పండ్ల మొక్కలు పెంచుకోవడానికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తుంది. ఆసక్తి ఉండి అర్హత ఉన్న రైతులు పండ్ల తోటలను పెంచుకోవడానికి ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి. ఎందరు రైతులు ముందుకు వచ్చినా పండ్ల మొక్కలు మంజూరు చేస్తాం.

– గోపాల్ నాయక్, పీడీ, డీఆర్‌డీఏ

**మండలాల వారీగా రైతుల వివరాలు..**

| మండలం | గ్రామాలు | రైతుల సంఖ్య |
|---|---|---|
| మక్తల్ | 39 | 21,690 |
| మద్దూర్ | 30 | 21,816 |
| ఊట్కూర్ | 27 | 18,271 |
| దామరగిద్ద | 27 | 17,446 |
| నారాయణపేట | 26 | 19,942 |
| కోస్గి | 26 | 18,670 |
| మాగనూర్ | 20 | 9723 |
| నర్వ | 20 | 13,302 |
| కృష్ణా | 14 | 8981 |
| మరికల్ | 14 | 12,867 |
| ధన్వాడ | 10 | 10,529 |
| మొత్తం | 253 | 1,73,237 |

## న్యూస్‌రీల్

### సమాన్‌పల్లిలో వైద్య శిబిరం



**మక్తల్:** మండలం సమాన్‌పల్లిలో పచ్చకామెర్ల వ్యాధి సోకి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని చెప్పారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటన్న, డాక్టర్ తిరుపతి ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్, వెంకటేశ్వరమ్మ, రేణుక, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** తెలంగాణ గిరిజన బాలికల కళాశాలలు, పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ (బాలికల) ప్రిన్సిపాల్ బి.రజిని రాగాలత ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని పాఠశాలలో జేఎల్‌గా మైక్రోబయాలజీ, పీజీటీగా ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ టీజీటీగా తెలుగు, ఇంగ్లిష్‌తో పాటు పీఈటీ పోస్టులు.. జడ్చర్ల పాఠశాలలో జేఎల్‌గా గణితం, కామర్స్; పీజీటీగా ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, టీజీటీగా గణితం, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలతో తమ కళాశాలలో జూలై 1వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిన వారు మాత్రమే అప్పన్నపల్లిలోని తిరుమల హిల్స్‌లో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో డెమో కోసం వచ్చే నెల 6వ తేదీ ఉదయం పది గంటలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు సెల్ నం. 8333925371కు సంప్రదించవచ్చని సూచించారు.

### రైల్వే గేటు తెరవడానికి త్వరలో సర్వే



**దేవరకద్ర:** నియోజకవర్గ కేంద్రంలో ఆర్వోబీని ప్రారంభించిన తరువాత రైల్వే గేటును మూసివేయడంతో వ్యాపారాలు పూర్తిగా డీలా పడ్డాయి. రోడ్డు పక్కన ఉన్న దుకాణాల సగం ఇప్పటికే మూసి వేయగా.. మిగిలిన వారు వ్యాపారం లేక ఆందోళన పడుతున్నారు. ఈ క్రమంలో రైల్వే గేటును తిరిగి తెరవాలని డిమాండ్ వచ్చింది. పట్టణ వాసులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు సంబంధిత రైల్వేశాఖ మంత్రికి, రైల్వే జీఎంకు లేఖలు రాశారు. దీంతో గేటు తెరవడానికి ఉన్న మార్గాలను రైల్వే అధికారులు అన్వేషించే పనిలే పడ్డారు. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి రాసిన లేఖలో దేవరకద్ర రైల్వే గేటు తెరవడానికి ప్రజల అభిప్రాయాలు తీసుకుని సాధ్యాసాధ్యాలపై సర్వే చేస్తారని పేర్కొన్నారు.

### ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

**కోస్గి:** మండలంలోని ముశ్రీఫా క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామాల రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు బుధవారం ఉచితంగా పీఆర్‌జీ–176 రకం కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ శరత్ చంద్ర, ఏఈఓ తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పోషప్ప, సర్పంచ్‌లు రుక్మప్ప, కొండారెడ్డి, ఉప సర్పంచ్ రుద్రప్ప, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బసప్ప, రైతులు నర్సిములు, మల్లేష్, గోపాల్‌రెడ్డి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పకడ్బందీగా ఎన్నికల సామగ్రి పరిశీలన



ఎన్నికల సామగ్రి గదిలో సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

**నారాయణపేట రూరల్:** రాబోవు శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎఫ్ఎల్‌సీ రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 29 నుంచి జూలై 7వ తేదీ వరకు ఎన్నికల సామగ్రికి సంబంధించిన 3వేల ఈవీఎంలు, బీయూ, సీయూ, వీవీప్యాట్స్‌లను ఇంజనీర్ల సమక్షంలో పరిశీలించనున్నామని తెలిపారు. దీనికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతారని, వారికి అందించిన ధ్రువీకరణ పత్రం, ఐడీ కార్డు పరిశీలించి లోపలికి అనుమతించాలని చెప్పారు. స్టాఫ్‌కు సైతం ఐడీకార్డులను అందించాలన్నారు. ప్రతీ అంశాన్ని వీడియో తీయాలని, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సామగ్రి గదిని పరిశీలించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఏఓ నర్సింగ్‌రావు, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, తహసీల్దార్‌లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అధికారులకు షోకాజ్ నోటీసులు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్

- సీరియస్ అయిన అడిషనల్ కలెక్టర్ మాయాంక్‌మిట్టల్
- వైకుంఠధామాలకు నీటి వసతి కల్పించాలి

**నారాయణపేట రూరల్:** జిల్లా అభివృద్ధిపై నిర్వహించే సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, సరైన వివరణ ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ మాయాంక్‌మిట్టల్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పరిశ్రమల ప్రమోట్ కమిటీతో ఆయన సమీక్ష చేపట్టారు. దీనికి కాలుష్యనివారణ, సీఎస్ఐటీసీ, సీటీఓ, ఎస్ఎఫ్‌సీ, పరిశ్రమల శాఖకు సంబంధించిన అధికారులు గైర్హాజరయ్యారు. దీనిపై సీరియస్ అయిన అడిషనల్ కలెక్టర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా టీ–ప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు అందించిన వాహనాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల వాహనాల కొనుగోలుకు ఇచ్చిన రాయితీలపై చర్చించారు. 21మంది ఎస్సీలకు రూ.7021878, 17మంది ఎస్టీలకు రూ.55069830, ఒక వికలాంగుడికి రూ.349650తో పాటు ఒక ఎస్సీ కేటగిరీలో రూ.7005 పావలావడ్డీకి రుణాలు ఇచ్చామని చెప్పారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు, లైసెన్స్, ప్లాన్ అప్రూవల్స్‌పై అనుసరిస్తున్న వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు విజయ్‌కుమార్, వీరస్వామి, యాదగిరి, ప్రభాకర్, శేఖర్, హరినాథ్‌రెడ్డి, యాదమ్మ, లక్ష్మీనర్సింహ, తిలక్, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటయ్య, రమేష్, రాంజీ పాల్గొన్నారు.

**వైకుంఠధామాలకు నీటి వసతి కల్పించాలి..**

జిల్లాలో నిర్మించిన వైకుంఠధామాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి వసతి కల్పించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష చేపట్టారు. నీటి వసతిలేక వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయనే ఫిర్యాదులు ఉన్నాయని, వెంటనే నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని వైకుంఠధామాలు స్థితిగతులు, మిషన్ భగీరథ పనుల వివరాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో డీపీఓ, ఏఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

**గ్రూప్స్ మోడల్ పేపర్ల పంపిణీ**

**నారాయణపేట రూరల్:** ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2022–23 విద్యా సంవత్సరంలో గ్రూప్స్ కోచింగ్‌కు హాజరైన అభ్యర్థులకు బుధవారం మోడల్ పేపర్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్ చేతుల మీదుగా అందించగా, వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్‌లో ర్యాంకులు సాధించి మంచి అధికారులుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలన్నారు. అధికారి కన్యాకుమారి, అభ్యర్థులు పాల్గొన్నారు.

### అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**నారాయణపేట రూరల్:** జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో వివిధ సబ్జెక్టుల బోధనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామన్య, భౌతిక, సాంఘికశాస్త్రం పాఠశాలలో, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, కామర్స్, ఎకనామిక్స్ కళాశాలలో బోధించడానికి పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 3, 5తేదీల్లో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

### మరింత పెరిగిన ఉల్లి ధరలు

- క్వింటాల్ గరిష్ట ధర రూ.1,460, కనిష్టంగా రూ.800

**దేవరకద్ర:** స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు గత వారం కంటే మరింత పెరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉల్లి సీజన్ ప్రారంభం కాగా.. సీజన్ తగ్గుముఖం పడుతున్న తరుణంలో వారంవారం ధర పెరుగుతోంది. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,460, కనిష్టంగా రూ.800 వరకు పలికింది. గత వారం కంటే గరిష్టంగా రూ.60 వరకు ధర పెరిగింది. ఇక్కడి మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా ఎక్కువగా రూ.750, తక్కువగా రూ.400 వరకు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు ఐదు వందల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. కొందరు రైతులు మార్కెట్‌లో విక్రయించకుండా మార్కెట్ బయట అమ్మకాలు సాగించారు.



దేవరకద్ర మార్కెట్‌లో తూకం వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్న ఉల్లి బస్తాలు

### మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



**మక్తల్:** మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలన కోసం హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ ఫోరం కృషి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష, జిల్లా జడ్జి శ్రీనివాసులు, ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సమాజంలో పౌరుల హక్కులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా వారి తరపున సంస్థ కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమాజానికి, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించాలని అన్నారు. సమాజంలో అవినీతి నిర్మూలన కోసం తమవంతు పాత్ర పోషిస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగరాజు ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీరామ్, ఉపాధ్యక్షుడు గవినోళ్ల జైపాల్‌రెడ్డి, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన కేంద్ర బృందం పరిశీలన

**దామరగిద్ద:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఢిల్లీకి చెందిన జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు రోజులుగా చేపట్టిన పరిశీలన ముగిసింది. బుధవారం ఎన్‌క్యూఏఎస్ బృందం వైద్యులు సింగా, డాక్టర్ ఎలిజిబెత్ మెకాలే వర్గీస్ ఇక్కడి ఓపీ, ఐపీ, రికార్డులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, మెడిసిన్, తాగునీరు, పారిశుధ్యం, సివిల్ వర్క్స్, ప్రహరీ, హరితహారం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. డీఎంహెచ్ఓ రామోహన్‌రావ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ, ఎన్‌సీడీ పీఓ సౌభాగ్యలక్ష్మి, పీఓ బాలాజీ, డీపీఓ భిక్షపతి వైద్యాధికారి నాగజ్యోతి, గౌతంరెడ్డి, రాజచంద్ర, సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఆపరేషన్ ముస్కాన్- 9పై సమీక్ష



ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**నారాయణపేట రూరల్:** చదువుకునే వయస్సులో వివిధ పనులకు వెళ్తున్న మైనర్ బాలలు గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్ బృందంతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పిల్లలను బడికి పంపకుండా పనిలోకి పంపిస్తే వారి తల్లిదండ్రులు, పనిలో పెట్టుకున్న యజమానులు శిక్షార్హులవుతారని చెప్పారు. జూలై 1 నుంచి 31వరకు నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వరావు నాయకత్వం వహిస్తారని, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ లైన్, బాలరక్ష భవన్, సఖి సెంటర్ తదితర శాఖల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలు వ్యవసాయ పనుల్లో, పశువుల కాపరులుగా, కిరాణం, హోటళ్లు, బిక్షాటన చేస్తున్న వారిని గుర్తించాలన్నారు. మొదట కౌన్సెలింగ్ ఇవ్వాలని, అవసరానికి తగ్గట్టు స్టేట్ హోంకు పంపించాలన్నారు. బాలకార్మికులను గుర్తిస్తే ప్రతి ఒక్కరు పోలీసులకు సమాచారం అందించాలని, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం ఆపరేషన్ స్మైల్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో వెంకటేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, రాంమనోహర్‌రావు, విద్యాసాగర్, రాధ, కమల, సుధాకర్, చంద్రశేఖర్, సుధామాధురి, వసంత పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



అభివాదం చేస్తున్న అఖిలపక్షం నాయకులు, సాధన సమితి సభ్యులు

- భగత్‌సింగ్ చౌరస్తాలో అఖిలపక్షం వంటా, వార్పు

**నారాయణపేట రూరల్:** రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయాలని అఖిలపక్షం రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కోటకొండ మండల దీక్షలు బుధవారానికి 50వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగురావునామాజి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్రాములుతో పాటు పలు విద్యార్థి, యువజన సంఘాల ప్రముఖులు హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా చేయడాన్ని విస్మరించడం అంటే రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. 50రోజులుగా మండల దీక్షలు చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం విడ్డూరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కోరిక తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, నిరంకుశత్వంగా వ్యవహరిస్తే రాబోవు ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రెండ్రోజుల క్రితం బండలింగాపూర్ (రంగారెడ్డి జిల్లా), ఇర్విన్ (జగిత్యాల)ను ప్రకటించి కోటకొండను విస్మరించడం సరికాదన్నారు. అంతకుముందు గ్రామంలో మేళతాళాలతో భారీ ర్యాలీ చేపట్టారు. భగత్‌సింగ్ చౌరస్తాలో వంటా, వార్పు నిర్వహించారు. హన్మేస్‌చారి, వెంకట్రామారెడ్డి, పగడాకుల శ్రీనివాసులు, బి.రాము, కెంచె శ్రీనివాస్, కాశీనాథ్, బాలరాం, సత్యయాదవ్, కృష్ణ, గోపాల్, హర్షవర్ధన్‌రెడ్డి, చెన్నప్ప, సలీం, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు అనసూయ, సునీత పాల్గొన్నారు.

### టీచర్లు శిక్షణకు.. విద్యార్థులు ఆటలకు..

**నారాయణపేట రూరల్:** విద్యాశాఖ తీరు విమర్శలకు తావిస్తోంది. వేసవితో పాటు ఇతర సెలవు రోజుల్లో ఖాళీగా ఉండి పాఠశాలలు నడిచే రోజుల్లో టీచర్లకు శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎస్‌టీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఇబ్బందిగా తయారైంది. శిక్షణ పేరుతో చాలాచోట్ల పాఠశాలలకు తాళాలు వేస్తుండగా.. కొన్ని గ్రామాల్లో వంట ఏజన్సీలకు చెప్పి మధ్యాహ్న భోజనం పెట్టించి ఆటలకు పరిమితం చేస్తున్నారు. తాజాగా జాలిఫోనిక్స్‌పై జిల్లా కేంద్రంలో రెండ్రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీంతో జిల్లాలోని పలు సింగిల్‌టీచర్ ప్రైమరీ స్కూల్‌లలో ఉండే ఒకేఒక్క టీచర్ అక్కడికి వెళ్లాల్సి వెళ్లిపోయారు. ఈ చిత్రం నారాయణపేట మండలం పిల్లిగుండ్లతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందినది.



## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

మన్ననూర్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళవారం రాత్రి సుమారు 12గంటల సమయంలో చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ (మన్ననూర్) గ్రామానికి చెందిన చిటుగోరి బాలయ్య కుమారుడు చిటుగోరి వెంకటేష్(24) కొంత కాలంగా హైదరా బాద్‌లో ఓ ప్రైవేటు వాహనం (కారు) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం మన్ననూర్ వచ్చాడు. రాత్రి 9 గంటలకు తిరిగి హైదరా బాద్ వెళ్తుండగా కడ్తాల గ్రామం సమీపంలో టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో 108 అంబులెన్స్ సహాయంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని కడ్తాల పోలీసులు తెలిపారు.

### మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

వెల్దండ: మండల పరిధిలోని తిమ్మినోనిపల్లికి చెందిన అమరిశెట్టి రమాదేవి మెడలో ఉన్న దాదాపు నాలుగు తులాల బంగారు పుస్తెలు, గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి. రమాదేవి, వరుసకు వదిన అయిన పద్మతో కలసి కల్వకుర్తి వెళ్లడానికి కొట్రగేట్ వద్దకు నడుచుకుంటూ వస్తున్నారు. అక్కడ ఉన్న ఓ వద్ద దొంగరోడ్డులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రమాదేవి మెడలో ఉన్న బంగారు పుస్తెల గొలుసును లాక్కొన్ని పారిపోయారు. దీంతో చోరీ జరిగిందని ఆమె బిగ్గరగా కేకలు వేసింది. కానీ వారు అప్పటికే పరారు కావడంతో ఫలితం లేకపోయింది. ఘటనలో ఆమె కింద పడడంతో స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయంపై వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ పిర్యాదు చేశారు.

**మిడ్జిల్ పరిధిలో...**

మిడ్జిల్: వేముల గ్రామానికి చెందిన చెందిన బండారి లింగమ్మ గ్రామ శివారులోని వెల్జాల్ రోడ్డు పైన నిత్యం కల్లు విక్రయాలు చేపడుతుంది. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సైతం విక్రయాల కోసం కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును చోరీ చేశారు. ఆమె కేకలు వేసే లోపు పరారయ్యారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు. కాగా పుస్తెల తాడు విలువ సుమారు రూ. 1.20 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు..

### నాగర్‌దొడ్డిలో 40 ట్రాక్టర్ల ఇసుక సీజ్


మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డిలో బుధవారం 40 ట్రిప్పుల ఇసుకను ఎస్‌ఐ శేఖర్ సీజ్ చేశారు. గ్రామ సమీపంలోని రిజర్వాయర్ నుంచి అక్రమంగా తరలించి కేశవులు అనే వ్యక్తి ఇంటి సమీపంలో నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని అక్రమంగా నిల్వ ఉంచిన 40 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు.

### పాలెంలో కంది విత్తనాలు

బిజినేపల్లి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పీఆర్‌జీ–176 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌జీ– 176 (ఉజ్వల)రకం విత్తనాలు కావాల్సిన రైతులు పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్‌ను సందర్శించి కొనుగోలు చేయవచ్చని, విత్తనాలు కావాల్సిన రైతులు 88088 82766, 62811 21529 నంబర్లను సంప్రదిస్తే.. విత్తన నిల్వలపై మరింత సమాచారం అందుతుందని పేర్కొన్నారు.

# ‘ఇండోర్’ పనులు ముమ్మరం

- పాలమూర్‌లో రూ.7.79 కోట్ల వ్యయంతో అధునాతన మల్టీపర్పస్ స్టేడియం
- మెయిన్ స్టేడియంలో కొనసాగుతున్న పనులు
- సిద్ధమవుతున్న ప్రేక్షకుల గ్యాలరీ
- భవిష్యత్‌లో జాతీయ స్థాయి ఇండోర్ పోటీలకు అవకాశం


మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నమూనా

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి కృషితో ఉమ్మడి జిల్లాకే తలమానికంగా జిల్లా కేంద్రంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతోంది. ఇన్నాళ్లు ఈ స్టేడియం లేకపోవడంతో ఇండోర్ ఆటల్లో క్రీడాకారులు అంతగా రాణించలేకపోతున్నారు. అలాగే ఇతర టోర్నీలు నిర్వహిస్తున్నప్పటికీ, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాటోర్నీలకు అవకాశం లేకుండాపోయింది.

**రూ.7.79 కోట్లతో సౌకర్యాలు..**

మెయిన్ స్టేడియంలో రూ.7కోట్ల 79లక్షల వ్యయంతో అధునాతనమైన క్రీడా సౌకర్యాలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులపై మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో ఫ్లోర్‌లో పెవిలియన్, ఇతర గదుల పనులు పూర్తి చేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు ఫిట్టింగ్ (ట్రస్సెస్) చేశారు. ఇండోర్ స్టేడియంలో లోపల క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపులా గ్యాలరీలో సీట్లను అమర్చుతున్నారు. బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడలకు హాళ్లను ఏర్పాటు చేశారు. స్టేడియంలో కలర్ పనులతోపాటు ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సెంట్రలైజ్డ్ ఏసీ కండీషన్, ఆడియో సిస్టం, ఇతర పనులు చేపట్టనున్నారు. వీటికి సంబంధించి జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపారు.

**క్రీడాకారులకు మెరుగైన వసతులు..**

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అన్ని విధాలా క్రీడావసతులు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇండోర్ స్టేడియం పూర్తయితే వెయిట్ లిఫ్టింగ్, జూడో, కబడ్డీ, ఇతర ఇండోర్ క్రీడలు ఆడే అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో ఆడే క్రీడాకారులకు మంచి అవకాశాలు ఏర్పడనున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి ఇండోర్ క్రీడాపోటీలకు వేదికగా మారే అవకాశం ఉంది.


ప్రధాన స్టేడియంలో నిర్మాణమవుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం


ఇండోర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సీట్లు

**ముమ్మరంగా పనులు..**



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి వల్ల జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతోంది. పనులు ముమ్మ రంగా సాగుతున్నాయి. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు అందుబాటులోకి వస్తాయి. నిష్ణాతులైన కోచ్‌లు వస్తారు. ఇది అందుబాటులోకి వస్తే జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంది.
– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

**చాలా సంతోషంగా ఉంది...**



పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటువుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీంతోపాటు పలు స్టేడియంల నిర్మాణమవుతున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వ్యాయామ ఉపాధ్యాయుల తరఫున ధన్యవాదాలు. ఈ స్టేడియం ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా మారనుంది. – వేణుగోపాల్, పెటా టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

# చెంచుల జీవనంపై అధ్యయనం


చెంచులతో చర్చిస్తున్న శిక్షకుల బృందం

- వివరాలు సేకరించిన ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు
- అమలవుతున్న పథకాల తీరుపై చర్చ

బల్మూర్: ఒకప్పుడు అడవిలోనే గుడిసెలు ఏర్పాటు చేసుకుని సమాజానికి దూరంగా జీవించే చెంచులు, నేడు గ్రామాల్లో అందరితో పాటు నివసిస్తున్నారు. వారి జీవన విధానంపై అధ్యయనం చేయడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్‌డి) శిక్షకుల బృందం బుధవారం కొండనాగుల పంచాయతీలోని గుడిబండ చెంచు కాలనీని సందర్శించింది. కోఆర్డినేటర్ డాక్టర్ సత్యరంజన్ మహాకుల్ ఆధ్వర్యంలో అధికారులు చెంచు కుటుంబాలు, తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన 55 మంది ఎన్‌ఐఆర్‌డి శిక్షకులతో సమావేశం నిర్వహించారు. చెంచు కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా లబ్ధి, మహిళా సంఘాల ఏర్పాటు వారికి అమలవుతున్న ప్రత్యేక పథకాలపై చెంచులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా పని కల్పిస్తూ, అడ్వాన్స్‌గానే డబ్బులు చెల్లింస్తుండటంతో వలసలు మానేశారని డీఆర్‌డీఓ నర్సింగరావు తెలిపారు. ఐదు బృందాలుగా ఏర్పడిన సభ్యులు చెంచుల ఇళ్ల వద్దకు వెళ్లి జీవన స్థితిగతుల గురించి తెలుసున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీ శిక్షకుల బృందం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యరంజన్ మహాకుల్, డీఆర్‌డీఓ నర్సింగరావు, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, డీఎల్‌పీఓ వెంకటయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ రేవతి, చెంచుమహిళా సంఘం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మల్లేష్, ఏపీఎం చిట్టెమ్మ, ఏపీఓ సువర్ణ, ఐకేపి సిబ్బంది పాల్గొన్నారు.


చెంచు కుటుంబం వద్ద వివరాలు ఆరా తీస్తున్న ఎన్‌ఐఆర్‌డీ శిక్షకులు

# ఇసుక అక్రమ రవాణా కేసులో 6నెలల జైలు

వనపర్తి: ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ.. బుధవారం జూనియర్ సివిల్ జడ్జి, సెకండ్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జానకి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ రక్షితా కె. మూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. 2016 జనవరి 29న రాత్రి వనపర్తి రూరల్ స్టేషన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా.. కొత్తకోట రోడ్డులో మండలంలోని నాగమ్మ తండా ప్రాంతం నుంచి వచ్చిన లారీని తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి లారీ డ్రైవర్ ఇంద్రయ్య, లారీ యజమాని కురుమూర్తిపై అప్పటి ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి కేసు నమోదు చేశారు. పలు దఫాలుగా వాదోపవాదనలు విన్న తర్వాత తీర్పు వెలువడింది. నిందితులకు శిక్ష పడేందుకు కృషిచేసిన వనపర్తి సెకండ్ అడిషనల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీతా దేవి, సీఐ మహేశ్వర్ రావు, ఎస్‌ఐ నాగన్న, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ రాజేందర్‌లను ఎస్పీ అభినందించారు.

# నెలక్రితం పెళ్లి.. అంతలోనే మృతి

- మృతుడు ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్
- అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

జడ్చర్ల: నెల కిందటనే ఆ యువకునికి పెళ్లి అయ్యింది. అంతలోనే ఆకస్మికంగా చావు వార్త వినాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వినేష్(28) ఆకస్మికంగా అనుమానాస్పదస్థితిలో మరణించాడు. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు... మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుల్జరాంపేటకు చెందిన వినేష్ గత ఏడాది కాలంగా పోలేపల్లి సెజ్‌లోని ఎవర్‌జెన్ ఫార్మా పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 11న వినేష్‌కు వివాహమైంది. పెళ్లి తర్వాత జడ్చర్లలోనే ఉంటూ విధులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో సొంత ఊరు వెళ్లి, మంగళవారం జడ్చర్లకు వచ్చాడు. విధులకు హాజరయ్యారు. పనిలో ఉండగానే నోటిలో నురగలు కక్కుతూ మృతి చెందాడు. పరిశ్రమ నిర్వాహకులు గమనించే టప్పటికే మరణించినట్లు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వినేష్ మరణంపై పరిశ్రమ నిర్వాహకులకు సంబంధం ఉందని ఆరోపిస్తూ కొందరు పరిశ్రమ దగ్గర ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ ఖాదర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారించి, పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు. వినేష్ మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి చిన్నాన్న లావుడ్య బాబ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

# నేడు తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు


జిల్లా కేంద్రంలోని కాటన్‌మిల్ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి హైందవులకు ఇది మహాపర్వదినం. దీన్ని ‘శయనైకాదశి, ప్రథమ ఏకాదశి’ అని పిలుస్తారు. క్షీరాబ్దిలో శేషపాన్పుపైన శ్రీమహావిష్ణువు శయనించడం వల్ల దీన్ని శయనైకాదశి అంటారు. ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది. మోక్షాన్ని ఇచ్చే మాసం ఆషాఢం. ఈరోజు నుంచి ఉత్తరం ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లుగా కనిపిస్తాడు. నేటి (గురువారం) నుంచి ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీకశుద్ధ ఏకాదశి వరకు ‘చాతుర్మాస్య వ్రతాలు’ పాటిస్తారు. ఏకాదశి 11 సంఖ్యకు సంకేతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు వెరసి పదకొండింటిపైన నియంత్రణ కలిగి వ్రతం ఆచరించాలన్నది ఈ పండుగ సందేశం. ఈరోజు నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. రాబోయే శ్రావణ మాసంలో మహిళలు ఆచరించే వ్రతాలు, నోములు బాధ్రపద మాసంలో వినాయక నవరాత్రులు, దాని తర్వాత దేవీనవరాత్రులు, దసరా, దీపావళి ఇలా ఎన్నో పండుగలుకు ఈ చాత్మరుస్యం విశేషమైనది.

**అభిషేకాలకు ప్రత్యేకం..**

తొలి ఏకాదశికి దేవాలయాల్లో ఎక్కాహం, అభిషేకాలు చేపడుతారు. ఎక్కాహం అంటే 24 గంటల పాటు ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఎప్పుడైతే ప్రారంభిస్తారో మరునాడు అదే సమయం వరకు నిరంతరం భక్తి భజనలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

తొలి ఏకాదశి పూజలకు పట్టణంలోని పలు ఆలయాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సింహగిరిలోని లక్ష్మీ నరసింహ్మస్వామి ఆలయం, రేణుకా ఎల్లమ్మ గుడి, పాత శివాలయం, బండ్లగేరి ప్రాంతంలోని శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం, టీచర్స్ కాలనీ రామాలయం, పిల్లలమర్రి సమీపంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు దేవాలయాల్లో నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ఎంతో విశిష్టత..**



తొలి ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంటుంది. ఏకాదశి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం అత్యంత పుణ్యప్రదమైనది. ఈ ఆషాఢ మాసంలో విశేషంగా అనేక పండుగలు ఉంటాయి. ఈ చాతుర్మసం దేవతా పూజలకు నిలయమైనది. వచ్చే పండుగలకు ప్రారంభసూచిక తొలి ఏకాదశి.
– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, కార్యనిర్వహణాధికారి, కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ

# నల్లమలలో పెరిగిన పెద్దపులుల సంఖ్య


అక్కమ్మబిలం వద్ద రోడ్డు దాటుతున్న పెద్ద పులి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పెద్ద పులుల సంఖ్య పెరగడంతో సంచారం అధికమైంది. నల్లమల ప్రాంతం గత 30ఏళ్ల పరిస్థితులను తలపించే విధంగా రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో పెద్దపులి సంచారం కనిపిస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. సోమవారం రాత్రి శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అక్కమ్మ బిలం వద్ద శ్రీశైలం వైపు జీపులో ప్రయాణిస్తున్న వారికి పెద్దపులి రోడ్డు దాటుతుండగా కనిపించిందని తెలిపారు. గంభీరమైన రూపంలో భారీ ఖాయంతో అతి సమీపంలోనే పెద్ద పులి కనిపించడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు. జీపు లైట్ల వెలుతురుకు త్వరగా రోడ్డు దాటి అభయారణ్యంలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నామని అన్నారు. ఇదిలా ఉండగా వటువర్లపల్లి గ్రామ వ్యవసాయ పొలాలు, సమీప అటవీ ప్రాంతంలోనే రెండు మూడు పెద్దపులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపారు. అటవీ సరిహద్దు పరిసర ప్రాంతంలో వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాలు, వ్యవసాయ పొలాలు ఉండటంతో ప్రజలు, కాడెద్దులపై దాడి చేసే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని పెద్దపులులను లోతట్టు అభయారణ్యంలోకి తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ఆరు టిప్పర్లకు రూ.1.50లక్షల జరిమానా

దేవరకద్ర: నారాయణపేట జిల్లా పరిధిలో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం పట్టుబడిప ఆరు ఇసుక టిప్పర్లకు ఒక్కోదానికి రూ.25 వేల చొప్పున రూ.1.50 లక్షల జరిమానాను విధించారు. మాగనూర్ రిచ్ పాయింట్ నుంచి నారాయణపేటకు అనుమతి పత్రాలతో తరలించాల్సిన ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్‌కి తరలిస్తుండగా తహసీల్దార్ జ్యోతి వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బుధవారం టిప్పర్ యజమానులు తెచ్చిన అనుమతిపత్రాలు నారాయణపేట జిల్లా పరిధిలోవి కావడంతో అక్కడి అనుమతులతో అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో ఆరు టిప్పర్లకు జరిమానా విధించారు.

- నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ప్రతి రోజు టిప్పర్ల ద్వారా ఇసుకను రోజంతా నారాయణపేటకు తరలిస్తారు. చివరగా సాయంత్రం ట్రిప్పు ఇసుకను మహబూబ్‌నగర్‌కు తరలించి అక్రమంగా అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ ఇలాగే జరుగుతుందనే సమాచారం.

# జోగుళాంబకు బంగారు పతకం


ఆలయ చైర్మన్, పాలక మండలికి అందజేస్తున్న బంగారు పతకం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి బుధవారం ఓ భక్తుడు రూ.7.60లక్షల విలువ చేసే బంగారు పతకాన్ని అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కడప జిల్లాకు చెందిన దేవగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి, ప్రభావతి దంపతులు 111 గ్రాముల బరువు ఉన్న బంగారు మహాకాళీ పతకాన్ని తయారు చేయించారు. వీటిని అమ్మవారి వద్ద ఉంచి పూజ చేయించి అనంతరం ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలక మండలి ధర్మకర్తలు వెంకటనారాయణ రెడ్డి, ఆనంద్ శర్మలకు అందజేసినట్లు ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ తెలిపారు. గతంలో కూడా ఈ దంపతులు అమ్మవారికి మరో బంగారు పతకాన్ని సమర్పించారు. విశేష సందర్భాల్లో వీటిని అలంకరించాలా లేక నిత్యం అమ్మవారికి అలంకరించాలా అనే అంశంలో ఆలయ అర్చకులతో మాట్లాడి పాలకమండలి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు. దాతలను ఆలయ చైర్మన్, పాలక మండలి అభినందిస్తూ.. వారికి ప్రసాదాలు అందజేశారు.

# బక్రీద్‌కు పొట్టేళ్లు సిద్ధం

- ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజుకు ఏర్పాట్లు


పాలమూరులోని రహెమానియా ఈద్గా


మహబూబ్‌నగర్‌లో న్యూటౌన్ వద్ద పొట్టేళ్ల విక్రయాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం చివరి మాసమైన జిల్‌హిజ్జా 10తేదీన జరుపుకునే ఈ పండుగను ‘ఈదుల్ జుహా’ వ్యవహరిస్తారు. సామూహికంగా ముస్లింలు ఈద్గాకు వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేయడం రివాజు. జిల్లావ్యాప్తంగా సర్వమానవ కల్యాణం కోసం నమాజు చేసి ప్రార్థనలు చేస్తారు. కాగా.. పండుగ సందర్భంగా గొర్రె పొటేళ్ల వికర్యాలు ఊపందుకున్నాయి. మహబూబ్‌నగర్‌లోని జామియ మసీదు నుంచి ఉదయం 8.00 గంటలకు ముస్లింలు సామూహికంగా గడియారం చౌరస్తా మీదుగా స్థానిక రహెమానియ ఈద్గా వద్దకు చేరుకొని 9 గంటలకు ప్రత్యేక ఈద్ నమాజ్ చేస్తారు. జామియా మసీదు ప్రధాన ఇమామ్ హాఫిజ్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు ప్రార్థనలు చేయిస్తారు.

**మజీదుల్లో ప్రత్యేక ఈద్ నమాజ్‌లు..**

మహబూబ్‌నగర్‌లోని మజీదుల్లో ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. మక్కా మజీద్, మదీనా మజీద్, రైల్వేస్టేషన్ మజీదే ఓమర్, సిరాజుల్ ఉలుమ్ మజీద్, మజీదే షర్ఫి చమన్, షాసాబ్‌గుట్ట మజీద్, సూఫియ మజీద్, మునీర్ మజీద్, షంసు, అల్‌కౌసర్, అన్వారే మదీనా మజీద్‌లతో తోపాటు ఇతర మజీద్‌లలో బక్రీద్ ఈద్ నమాజ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ఊపందుకున్న పొట్టేళ్ల విక్రయాలు**

బక్రీద్‌లో ఖుర్బానీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు పొట్టేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో నాలుగు రోజుల నుంచే విక్రయ కేంద్రాలు వెలిశాయి. ఈ ఏడాది పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మరో రెండు రోజుల పాటు పొట్టేళ్ల విక్రయాలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్, వన్‌టౌన్, క్లాక్‌టవర్, మార్కెట్, మదీనా మసీద్, షాసాబ్‌గుట్ట, రాయచూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖుర్బాని మూడు రోజులు ఉండడంతో పొటెళ్లను విక్రయానికి ఉంచారు. ఉమ్మడి జిల్లాలో ఈ మూడు రోజుల్లో 2 లక్షలకు పైగా పొట్టేళ్లకు విక్రయాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా పండుగకు సంబంధించి దుకాణాల్లో పండుగ ప్రత్యేక వంటకం షీర్ కుర్మ తయారీ కోసం ఉపయోగించే సేమియాలు, డ్రైఫ్రూట్స్‌లతో పాటు మిస్వాక్, ఇత్తర్ (సుగంధ ద్రవ్యాలు), సుర్మాలను కొనుగోలు చేశారు.



